ఇటుకల పండగ సందడి

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: మండలంలో ఇటుకల పండగ సందడి నెలకొంది. ఈ పండగను సుమారు వారం రోజులపాటు ప్రాంతాలవారీగా గిరిజనులు జరుపు కుంటారు. ఈ పండుగను పురస్కరించుకొని మండలం లోని గ్రామాల్లో గిరి మహిళలు రోడ్డుకు అడ్డంగా గేట్లు వేసి పజోర్ (చందా)వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో మహిళలు బ్యాచులుగా ఏర్పడి గ్రామానికి సమీపంలో ప్రధాన రహదారుల్లో కర్రలతో గేట్లు వేసి పజోర్ వసూలు చేస్తారు. ఒకవేళ అటువైపుగా వెళ్లిన వాహనదారులు పజోర్ ఇవ్వకపోతే వారిపై సరదాగా పేడ నీళ్లు, రంగు నీళ్లు పోయడం ఆనవాయితీ. సేకరించిన చందా డబ్బులతో మహిళలు సరదాగా పిండి వంటలు చేసుకోవడం లేదా అందరూ కలిసి ఏదో ఒక వస్తువులను కొనుక్కుంటారు. ప్రతి గ్రామంలో గేట్లు వేసి మహిళలు సరదాగా పజోల్ వసూలు చేస్తుండటంతో అడుగడుగునా ఇటుకల పండగ సందడి నెలకొంది.

చందాలు వసూలు చేస్తున్న గిరిజనులు

టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

-సమస్యాత్మక కేంద్రాలు గుర్తింపు

-ఎస్ఎస్‌సి ఎగ్జామినేషన్స్ జిల్లా అబ్జర్వర్ సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో పదో తరగతి పరీక్షలను పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్, ఎస్ఎస్‌సి ఎగ్జామినేషన్స్ జిల్లా అబ్జర్వర్ సుబ్బారెడ్డి తెలిపారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై శనివారం డిఇఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని 69 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 11,552 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. బాలురు 5,374 మంది, బాలికలు 6,148 మంది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాసేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్, మెడికల్ వంటి తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిబ్బంది ఎటువంటి పరిస్థితుల్లో పరీక్షా కేంద్రాలకు మొబైల్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకు రాకూడదన్నారు. సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించి విధులు నిర్వహించాలని తెలిపారు.

మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

మాల్ ప్రాక్టీస్ కు పాల్పడితే సివియర్ డిసిప్లినరీ యాక్షన్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది సామాన్య శాస్త్రంలో భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు కలిపి ఒకే ప్రశ్న పత్రం ఉంటుందని తెలిపారు. జవాబులు రాసేందుకు భౌతిక, రసాయన శాస్త్రాలకు 12 పేజీల బుక్లెట్, జీవశాస్త్రానికి మరో 12 పేజీల బుక్లెట్ విడివిడిగా ఇస్తారని తెలిపారు. ప్రశ్న పత్రాల్లో క్యూ ఆర్ కోడ్ ఉంటుందని మాల్ ప్రాక్టీస్ వంటివి జరిగితే సులువుగా గుర్తించవచ్చన్నారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు ఆయా విభాగాలకు సంబంధించిన అధికారులతో ఇప్పటికే సమన్వయం చేసుకుంటూ ముందుకెళుతున్నామన్నారు. డిఇఒ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, పరీక్షలకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే 08842379328 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. జిల్లాలో ముంచింగిపుట్టు సిఎహెచ్ఎస్ స్కూల్, కూనవరం జడ్‌పి హైస్కూల్, అరకు వ్యాలీ, వై.రామవరం జిటిడబ్ల్యు ఆశ్రమ బాలికల పాఠశాలలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పాలన యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని పేర్కొన్నారు.

గిరిజన సంఘం మహాసభలను జయప్రదం చేయండి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: జూన్ 5,6, 7.తేదీలో జరిగే గిరిజన సంఘం 8వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అధ్యక్షతన అరకు వేలి గిరిజన సంఘం కార్యాలయంలో వివిధ ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, గిరిజన సంఘం 8వ రాష్ట్ర మహాసభలో గిరిజన హక్కులు, చట్టాలు, రక్షణ కోసం గిరిజన ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం చర్చించడం జరుగుతుంద న్నారు. గ్రామసభ, పీసా కమిటీ అనుమతి లేకుండా గిరిజన ప్రాంతం అక్రమ మైనింగ్, హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1/70, పీసా చట్టాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కి చట్టాలు మార్చుతున్నాయన్నారు. నూతన ఆటవి పాలసీ విధానం తీసుకొచ్చి గిరిజనులను అటవీ నుంచి గెంటి వేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యహరిస్తుందని విమర్శించారు. జీఓ 3కు చట్టబద్ధత కల్పించాలని, బోయ వాల్మీకులను ఎస్టీ జాబితా చేర్చాలని జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీ తీర్మానం విరమించుకోకుంటే భవిష్యత్తులో మరింత పోరాటం చేస్తామని హెచ్చరించారు. మాతృభాష విద్య వాలంటర్లకు ఉద్యోగ భద్రత కల్పించి గిరిజన అక్షరాస్యత పెంపొందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చెప్పారు. చింతపల్లి, అనంతగిరి మండలాల పరిధిలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం గ్రామసభ అనుమతి లేకుండా దొంగ సర్వేలు నిర్వహించి గిరిజనులను భయభ్రాంతులకు గురి చేయడం తగ్గదన్నారు. గిరిజన గ్రామాలకు మంచినీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. మేధావులు, ఉద్యోగులు మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి జెడ్పిటిసి ధీసరి గంగరాజు, ఉపాధి హామీ కూలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోతురాజు, అఖిల భారత గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తౌడన్న చిట్టిబాబు, చిన్నం నాయుడు, మాతృభాష విద్య వాలంటరీ రాష్ట్ర అధ్యక్షులు పాంగి శ్రీను, మాతృ భాష విద్యా వాలంటీర్ల జిల్లా కార్యదర్శి కొర్ర సర్బనాయుడు, జిల్లా అధ్యక్షురాలు పి.కుమారి, గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, మండల నాయకులు కె.రామారావు, సత్యనారాయణ, పి సురేష్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ ఎస్ గంగమ్మ, ఎస్ఎఫ్ఐ మండల గర్ల్స్ కన్వీనర్ కే.ధనలక్ష్మి, కె.కృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర.

3 నుంచి టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి- పెదబయలు : ఈనెల 3 నుంచి జరిగే పది పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల్లో 12ఆశ్రమ వసతి గృహాలను పది పరీక్షలకు మూడు కేంద్రాలుగా విభజించారు. స్థానిక రెసిడెన్షియల్ బాలూర పాఠశాలలో 200మంది, బాలికల పాఠశాలలో 154మంది, జెడ్పీ హెచ్ పాఠశాలలో 195 మంది హాజరవుతున్నట్లు మండల విద్యా శాఖదికారి సింహాచలం తెలిపారు. విద్యార్థులకు కేంద్రాలకు సకాంలో చేరుకోవాలని సూచించారు.

మోదకొండమ్మ ఉత్సవాలకు శ్రీకారం

రాటను వేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులు

పాడేరులో రాటను ప్రతిష్టించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి -పాడేరు: పాడేరులో మే 14, 15, 16 తేదీలలో నిర్వహించ తలపెట్టిన మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా శనివారం పాడేరు మెయిన్ రోడ్‌లో ముహూర్తపు రాటను ప్రతిష్టించి అమ్మవారి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. మోదకొండమ్మ ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కె భాగ్యలక్ష్మి, సర్పంచ్ కె ఉషారాణి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్య దొర, తదితరులు పూజలు నిర్వహించి ముహూర్తపు రాటను ప్రతిష్టించారు. గ్రామంలోని పెద్దలు, మహిళలు, భక్తులు ముహూర్తపు రాటకు పూజలు జరిపారు. మోదకొండమ్మ ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం రాట ప్రతిష్టతను నిర్వహించారు. అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా పాడేరు పట్టణంలోని మెయిన్ రోడ్‌లో మూడు రోజులపాటు కొలువు తీర్చి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ముహూర్తం రాట అనంతరం అమ్మవారిని కొలువు తీర్చేందుకు మెయిన్ రోడ్ లో శతకంపట్టు ఏర్పాటు పనులతో పాటు ఉత్సవాల ఏర్పాట్లు అన్ని జోరుగా మొదలుపెట్టడానికి ఆలయ కమిటీ ఉత్సవ కమిటీ పనులు చేపట్టనున్నారు. మే 12న అమ్మవారి జయంతి పండుగను మొదలుకొని 14, 15, 16 తేదీల్లో అమ్మవారి జాతర మహోత్సవాలు జరగనున్నందున ఐదు రోజులపాటు పాడేరు పట్టణంలో ఉత్సవాల సందడి నెలకొననుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ తమ్మర్బ నర్సింగ్‌రావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కె.సుబ్బారావు, సర్పంచ్ ఉషారాణి, ఉపసర్పంచ్ భూ రెడ్డి రాము, ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వర్తన పిన్నయ్యదొర, తమ్మర్బ ప్రసాద్ నాయుడు, నవర కొండబాబు, ఎంపీపీ కుమారి, వైస్ ఎంపీపీలు గంగ పూజారి, శివ కుమార్, కనకాలమ్మ పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

వైద్యునితో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు:ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చొరవతో గాయిత్రి విద్యా పరిషత్ ఆసుపత్రి, డిగ్రీ కళాశాల, పిజి వైద్య కళాశాల (అటానమస్) సంయుక్తంగా శనివారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. బిపి, షుగర్, కంటి పరీక్షలు, ఇసిజి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. కలెక్టరేట్‌లో ఉన్న వివిధ విభాగాలు, ఐటిడిఏ, గిరిజన సంక్షేమ శాఖ, సబ్ కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ, ఉద్యాన వన శాఖ, డ్వామా, సమాచార పౌర సంబంధాల శాఖల అధికారులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 334 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. జనరల్ మెడిసిన్‌లో 150 మందికి, కార్డియాలజీ(చెస్ట్) 25, గైనిక్ 54, డెంటల్ 25, కంటి వైద్య సేవలు 35 మందికి వైద్యం అందించారు. స్థానిక గిరిజనులకు వైద్య శిబిరంలో వైద్య సేవలను అందించారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న జి.మాడుగుల మండలం కుంబిడి సింగి గ్రామానికి చెందిన ఎస్.నీలవేణికి జిల్లా కలెక్టర్ స్వయంగా దగ్గర ఉండి వైద్య పరీక్షలు చేయించారు. విశాఖపట్నంలో మెరుగైన వైద్యం అందిస్తామని అన్నారు. గాయిత్రి వైద్య విద్యా సంస్థలకు చెందిన పలువురు వైద్య నిపుణులు ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించారు. మెడికల్ సూపరింటెండెంట్ జనరల్ సర్జరీ ఎ.రంగారావు, జనరల్ మెడిసిన్ వైద్యులు వి.ధర్మారావు, అఖిలేష్, ముఖ్య పరిపాలనాధికారి (జనరల్ సర్జరీ) డాక్టర్ అనిల్ చంద్ర, గుండె మరియు క్షయ నివారణ వైద్య నిపుణులు సి.రాఘవేంద్ర, దంత, కంటి వైద్య నిపుణులు ఎల్.చంద్ర శేఖర్, నరసింహరావు, గైనకాలజిస్టులు కె. ఉమాదేవి, సౌమ్య వైద్య సేవలు అందించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబేద్కర్, పాడేరు తహహశీల్దార్ వి.త్రినాధరావు నాయుడు, వైద్యాధికారులు బోస్, సాయిరూప్, జి.సూర్య ప్రకాష్, రాజు, లక్ష్మి నారాయణ, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతగిరి:అనంతగిరి మండలం డెక్కపురం, హుకుంపేట మండలం పట్టుకదౌడ గ్రామాలకు మంజూరైన రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఆయా గ్రామాల పిటిజీ గిరిజన ప్రజలు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కిల్లో .సింగురు, ఆనంద్, ప్రసాద్ కృష్ణ లు మాట్లాడుతూ, తమ గ్రామానికి రోడ్డు శంకుస్థాపనకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఓట్లతో గెలుపొందిన ఎమ్మెల్యే తమ గ్రామాల అభివృద్ధిని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికలలో తమ గ్రామంలో అడుగు పెడితే తరిమి కొడతామని హెచ్చరించారు.

నినదాలు చేస్తున్న గిరిజనులు

ఉపాధి, విద్యుత్, ఆర్‌ఆర్ ప్యాకేజీ కల్పించండి

- పంప్డు స్టోరేజ్ ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణలో నాయకులు, గిరిజనుల డిమాండ్

- హామీలు లిఖితపూర్వకంగా ఇచ్చేందుకు అధికారుల నిరాకరణ

అధికారులకు విన్నవిస్తున్న నిర్వాసిత శాండుకోరి గ్రామస్తులు, జెసికి వినతిపత్రం సీలేరు ఎంపిటిసి సాంబమూర్తి

ప్రజాశక్తి -సీలేరు

జీకే.వీధి మండలం సీలేరు పార్వతి నగర్ సమీపంలో పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తం పర్యావరణ అనుమతులకు శనివారం స్థానిక ఫుడ్ బాల్ గ్రౌండ్లో ప్రజా అభిప్రాయ సేకరణ నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీరు సుదర్శన్, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్, ఏపి జెన్‌కో ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, ఇన్‌ఛార్జి సర్పంచ్ కె.వల్లి ప్రసాద్ మాట్లాడుతూ పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నెలకొల్పడానికి తాము వ్యతిరేకం కాదని తెలిపారు. అయితే స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనలో ప్రథమ ప్రాధాన్యత కల్పించాలని, 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, జీకే వీధి నుంచి సీలేరు వరకు అస్తవ్యస్తంగా ఉన్న రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, స్థానికులకు పక్క భవనాలు నిర్మించుకోవడానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు, దుప్పులివాడ సర్పంచ్ కుమారి, గిరిజన నాయకులు మార్క్ రాజు, కోడా ఆనందు, సుంకర విష్ణుమూర్తి, నక్క తిరుమలరావు మాట్లాడుతూ పంపు స్టోరేజ్ ప్రాజెక్టును స్వాగతిస్తున్నామని, 1/70 చట్టం ప్రకారం కొత్త ప్రాజెక్టులో స్థానిక గిరిజన యువతకు పూర్తిస్థాయిలో ఉద్యోగ, ఉపాధి కల్పించాలని కోరారు. తమ గ్రామాలకు సమీపంలో విద్యుత్ ఉత్పత్తి అవుతున్నా, తమకు విద్యుత్ లేని పరిస్థితి ఉందని, అందువల్ల స్థానిక గిరిజన గ్రామాలకు సీలేరు నుంచి నేరుగా విద్యుత్ ఇవ్వాలని, తమ పిల్లలకు డిఎవి పాఠశాలలో ఉచితంగా విద్యను అందించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు మారిపోతూ ఉంటారని, ఇప్పుడు ఇచ్చిన హామీలు అమలుపై ఎవరు బాధ్యత వహిస్తారని, అందువల్ల హామీలు లిఖితపూర్వకంగా ఇవ్వాలని ధారకొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు వల్ల నష్టపోతున్న శాండుకోరి గ్రామస్తులు ప్రాజెక్టు నిర్మాణానికి తాము భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, అయితే ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు, ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలని అధికారులకు లిఖితపూర్వకంగా విన్నవించారు. అందుకు అధికారులు నిరాకరించారు.

మాట్లాడుతున్న ధారకొండ ఎంపిటిసి బుజ్జిబాబు

ఈ సందర్భంగా హైడెల్ డైరెక్టర్ ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ రూ.11,880 కోట్లతో 9 యూనిట్లు, 1350 మెగా వాట్లు సామర్థ్యంతో పంపు స్టోరేజీ ప్రాజెక్టు అండర్ గ్రౌండ్ పైప్ లైన్ ద్వారా నిర్మిస్తున్నామని, దీని వల్ల ఇబ్బందులు ఏమీ ఉండవని చెప్పారు. ప్రాజెక్టు వల్ల భూములు, ఇల్లు కోల్పోయిన వారికి ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేస్తామని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఇన్ఫ్రాస్ట్రక్చర్ పెరుగుతుందన్నారు. ప్రాజెక్టులో 50 మందికి ఉద్యోగాలు కల్పిస్తామని, కొంతమందికి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇస్తామని, 500 నుంచి 1000 మంది ఉపాధి కలుగుతుందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు.

10 కిలో మీటర్ల పరిధిలోని గ్రామాలకు న్యాయం : జెసి

జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల కోరిన డిమాండ్లను ఏపీ జెన్కో అధికారులు పరిశీలించి సీలేరు నుంచి పది కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు న్యాయం చేయాలని ఆదేశించారు. జీకే వీధి నుంచి సీలేరు వరకు జెన్కో నిధులతో రోడ్ల నిర్మాణం, సీలేరులో 50 పడకల ఆసుపత్రి, కనీస అవసరాలు ప్రజలకు సమకూర్చాలని సూచించారు. శాండుకోరి గ్రామ నిర్వాసితుల అడిగిన భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు, ఇంటికొక ఉద్యోగం, ఇతర అంశాలపై చర్చిస్తామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఇచ్చిన వినతిపత్రాలతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు తెలియజేసిన విషయాలను ఆన్ రికార్డ్ చేశామని, వాటి ఆధారంగా నివేదిక అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ శేషారెడ్డి, చీఫ్ ఇంజనీర్లు సుజయ్ కుమార్, బి.శ్రీధర్, ఎస్ఇ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈలు బాలకృష్ణ, శ్రీనివాస్, బాబూరావు, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, ఏడిఈ అప్పలనాయుడు, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత

ప్రజా అభిప్రాయ సేకరణలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చింతపల్లి ఎఎస్‌పి శివ కిషోర్ పర్యవేక్షణలో జీకే వీధి, కొయ్యూరు సిఐలు అశోక్ కుమార్, స్వామి నాయుడు ఆధ్వర్యాన సుమారు 150 మంది పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రతి ఒక్కరినీ ప్రధాన గేటు వద్ద తనిఖీ చేసి, వారి వివరాలు సేకరించి లోపలకు పంపించారు. ఇందులో సీలేరు, జికె.వీధి, మంప ఎస్ఐలు రామకృష్ణ, అప్పలసూరి, లోకేష్, సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, సివిల్, సీఆర్పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న ప్రజలు

శాశ్వత ఉద్యోగాల్లో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని వినతి

సీలేరు : సీలేరులో నూతనంగా నెలకొల్పుతున్న పంపు స్టోరేజ్ ప్రాజెక్టులో ఏపి జెన్‌కో కాంట్రాక్ట్ లేబరుకు శాశ్వత ఉద్యోగాలలో ప్రథమ ప్రాధాన్యత కల్పించాలని కాంట్రాక్ట్ లేబర్ సంఘం బ్రాంచ్ అధ్యక్షులు బి.లక్ష్మణ్ కార్యదర్శి ఆర్.అనిల్ శనివారం ఏపీ జెన్కో హైడల్ డైరెక్టర్ ఎంవివి సత్యనారాయణ, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి. శ్రీధర్‌ను కోరారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

ఎమ్మెల్యేకు ఆదివాసీల సెగ

బోయ వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో ఎలా చేరుస్తారంటూ మండిపాటు

ఎమ్మెల్యేను నిలదీయడానికి వెళ్తున్న గిరిజనులు, గిరిజన నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకించని గిరిజన ఎమ్మెల్యేలకు ఆదివాసీల నుండి నిరసనలు మొదలయ్యాయి. ఆసరా పథకం చెక్కులు పంపిణీ చేసేందుకు శనివారం రాజవొమ్మంగి వచ్చిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి నిరసన సెగ తగిలింది. గిరిజన సంఘం, ఆదివాసీ జేఏసీ నాయకులు కొండ్ల సూరిబాబు, వంతు బాలకృష్ణ, తాము సూరిబాబు, తెడ్ల అబ్బాయి, కుజం జగన్నాథం ఆధ్వర్యాన గిరిజనులు స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ఉన్న ఎమ్మెల్యేను ప్రభుత్వం తీసుకొచ్చిన 52 జీవోపై ప్రశ్నించడానికి వెళ్లారు. అయితే రాజవొమ్మంగి సిఐ బాజీలాల్ ఆధ్వర్యంలో రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్సైలు టీజీ నరేంద్ర ప్రసాద్, షరీఫ్ వారిని అడ్డుకున్నారు. ఎమ్మెల్యే ధనలక్ష్మిని కలవడానికి మూకుమ్మడిగా వెళ్లడానికి వీల్లేదని, పదిమంది నాయకులు వచ్చి ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇవ్వాలని సూచించారు. అందుకు వారు అంగీకరించలేదు. తామందరమూ కలిసి ఎమ్మెల్యేను ప్రశ్నిస్తామని, నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆమె సమాధానం చెప్పాలని గిరిజనులు పట్టుబట్టారు. దీంతో పోలీసులకు, గిరిజనులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. గిరిజనులు పోలీసులను దాటుకొని వెళ్లే ప్రయత్నం చేయగా, పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిగా సేపు అక్కడ ఉద్రిక్తత వాతావరణ నెలకొంది. ఎమ్మెల్యే అక్కడ నుండి వెళ్లిపోవడంతో స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద గిరిజన నాయకులు సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ కోసం కన్వీనర్ కమిటీ ఏర్పాటు చేశారు. జీవో నెంబర్ 52ను ఉపసంహరించుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం, ఆదివాసీ జేఏసీ నాయకులు బి రామకృష్ణ, వి అప్పారావు, ఈ శ్రీను, జి పెద్దిరాజు, ఏ సుబ్బలక్ష్మి, జి రమణి, ఎం గణలక్ష్మి, తెడ్ల రాంబాబు, పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

మాట్లాడుతున్న ఎంపిపి సార్ల లలిత

ప్రజాశక్తి మారేడుమిల్లి

మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామారావు అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సభలో ఎంపీపీ సార్ల లలిత కుమారి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నాడు-నేడు పనులతో విద్యాలయాల రూపురేఖలను మార్చి విద్యావ్యవస్థలో సరికొత్త మార్పులు తీసుకువచ్చిందని తెలిపారు. జెడ్పిటిసి జి బాలాజీబాబు మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యాన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మారేడుమిల్లి సర్పంచ్ కె.జాకబ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలని, మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎల్.రవికుమార్, కో ఆప్షన్ సభ్యుడు జి ధర్మరాజు, వైసిపి నాయకులు సత్తి సత్యనారాయణ రెడ్డి, ఐటిడిఎ ఏఎంఓ శ్రీనివాస్, సిఎంఓ ప్రసాద్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వీరకుమారి, ఆశ్రమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిఎస్.కుమార్, పాఠశాల వార్డెన్ మడకం చిన్న విష్ణు దొర, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ దూబే లచ్చన్న దొర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామిరెడ్డి

వైద్య బృందం పర్యటన

ప్రజాశక్తి - పెదబయలు:కిండలం గ్రామంలో వరుస మరణాల నేపథ్యం కేంద్ర వైద్య బృందం శనివారం పర్యటించింది. సెంట్రల్ వైద్య డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రామిరెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న ప్రజలందరూ రక్త పరీక్షలు చేయించుకుని హైపర్ టెన్షన్ నిమిత్తం ఆరోగ్య కేంద్రంలో వైద్యం చేయించుకోవాలని తెలిపారు. గ్రామంలో వారం రోజులు వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కందుల గుంట గ్రామాన్ని సందర్శించారు. మూఢ నమ్మకాలను విడనాడాలని గ్రామ ప్రజలకు తెలిపారు. గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను తనిఖీ నిర్వహించారు. ప్రయోగశాలలో తనిఖీలు నిర్వహించి మందుల కొరతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ, గిరిజనులు మూఢ నమ్మకాలు విడనాడాలన్నారు. నాటు సారా, జీలుగు కళ్ళు తాగుతున్నారన్నారు. చుట్టా, బీడీ అధికంగా సేవించడంతో ఊపిరితిత్తులు వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా వైద్యాధికారి జమీల్ భాష, తదితరులు పాల్గొన్నారు.

6న దుంబ్రిగుడ మండల సమావేశం

ప్రజాశక్తి -దుంబ్రిగూడ: ఈ నెల 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో నగేష్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ సమావేశానికి మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచ్‌లతో పాటు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -పెదబయలు:పెదబయలు, ముంచింగిపుట్టు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ వసతి గృహాల్లో 2023- 24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్స్ పీ.కేశవరావు, ఎం.ఈశ్వరమ్మ ఒకప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో చేరుటకు బాలికలు 60, బాలురు 60సీట్లు మంజూరయ్యాయని తెలిపారు. ధవీకరణ పత్రాలతో పెదబయలు ఏకలవ్య నోడల్ పాఠశాలలో సంప్రదించ వచ్చని సూచించారు.

గీతం వర్సిటీకి ఐఇఇఇ అవార్డులు

ప్రజాశక్తి -మధురవాడ : ప్రపంచంలోని అతిపెద్ద వృత్తి నిపుణుల సంస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఇఇఇ) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఐఇఇఇ విద్యార్థి విభాగాన్ని ఈ ఏడాది అత్యుత్తమ విభాగంగా గుర్తిస్తూ అవార్డును అందజేసింది. దీంతో పాటు విద్యార్థులను సాంకేతికంగా ప్రోత్సహిస్తు వృత్తి నైపుణ్యాలను పెంచడంలో కృషి చేస్తున్న స్టూడెంట్ బ్రాంచి కౌన్సిలర్, ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ మహ్మద్ ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తికి అత్యుత్తమ వాలంటీర్ అవార్డును, విద్యార్థి విభాగం అధ్యక్షుడు టి.పవన్ విగ్నేష్‌కు, బి.నిహారికలకు అత్యుత్తమ స్టూడెంట్ వాలంటీర్ అవార్డులను అందించింది. నిరంతరం కార్యక్రమాలతో పాటు నూతన సభ్యులను ప్రోత్సహించడం, విద్యార్థులలో ఐఇఇఇ పట్ల అవగాహన పెంచడం ద్వారా ఈ గుర్తింపు లభించినట్లు అవార్డు గ్రహీతలు తెలిపారు. వీరిని శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి. విజయశేఖర్, ఇఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ జెబి. సెవెన్స్, సిఎస్ఇ విభాగాధిపతి ఆర్.శిరీష అభినందించారు.

బొట్టా ఈశ్వరమ్మకు మాతృ వియోగం

ప్రజాశక్తి- కంచరపాలెం : సిపిఎం మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ తల్లి కొయ్య చెల్లయమ్మ (82) శనివారం రాత్రి 7.45 సమయంలో ఆమె నివాసంలో మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు కుమారుడు కొయ్య నాగేశ్వరరావు, కుమార్తె బొట్టా ఈశ్వరమ్మ ఉన్నారు. చెల్లయ్యమ్మ మృతిపట్ల సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు సంతాపం తెలిపారు.

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చితే..

మూకుమ్మడి రాజీనామా

సర్పంచులు, ఎంపిటిసిలు ఏకగ్రీవ తీర్మానం
తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి-అరకులోయ:బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించడానికి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోకపోతే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని అరకులోయ సర్పంచులు, ఎంపీటీసీలు స్పష్టం చేశారు. అరకులోయ ఎంపీపీ రంజపల్లి ఉషారాణి నేతత్వంలో శనివారం అరకులోయ మండల పాలకవర్గ సమావేశం నిర్వహించారు. బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చరాదని వైసీపీ, టీడీపీ, సిపిఎం పార్టీల సర్పంచులు, ఎంపీటీసీలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. వీరిని ఎస్టీ జాబితాలో చేర్చి తమకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమని మండల పరిషత్ కార్యాలయం నుంచి తహసిల్దార్ కార్యాలయం వరకు సర్పంచులు, ఎంపీటీసీలు

నిరసన తెలుపుతున్న సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు

వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇప్పటికే జీవో 3 రద్దుతో గిరిజనుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని, నిరుద్యోగ సమస్య తీవ్రంగా పెరిగి పోయిందని సర్పంచులు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో అన్ని రకాలుగా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన బోయ,వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించడానికి ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమన్నారు. ఈ చర్యను పార్టీలకు అతీతంగా తాము వ్యతిరేకిస్తున్నామని ప్రభుత్వం వెంటనే ఆ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. అరకులోయలోని 14 పంచాయతీల్లో ఇప్పటికే ఆయా పంచాయతీలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానానికి వ్యతిరేకంగా పాలకవర్గ సభ్యులు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపినట్లు వారు తెలిపారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే మండలంలోని 16 మంది ఎంపీటీసీలు, 14 మంది సర్పంచులు, ఎంపీపీ మూ కుమ్మడి రాజీనామాలు చేస్తామని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్, దురియ ఆనంద్ కుమార్, రామన్న, సర్పంచులు, ఎంపీటీసీలు హెచ్చరించారు. తమకు పార్టీలు, పదవుల కన్నా గిరిజనుల భవిష్యత్తు ముఖ్యమని వారు స్పష్టం చేశారు. గిరిజన ప్రజల ఆందోళన ఆవేదనలను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టిలో పెట్టుకొని బోయ,వాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్పించే తీర్మానాన్ని ఉప సంహరించుకోవాలని, అదేవిధంగా గిరిజన ప్రాంతం నుంచి గిరిజన ఓట్లతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎస్టీ కమిషన్ చైర్మన్ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేక ప్రకటనలు చేసి తాము చేస్తున్న పోరాటానికి మద్దతు తెలపాలని, లేనిపక్షంలో ప్రజా క్షేత్రంలో అడుగు పెట్టలేరని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 14 పంచాయతీల సర్పంచులు, 16 మంది ఎంపీటీసీలు పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:కార్మికులు, కర్షకులు, శ్రమజీవులపై నరేంద్ర మోడీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని .సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. .శనివారం అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పొద్దు బాలదేవ్, ఎస్‌బీ పోతురాజుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోడీ పాలన కార్పొరేట్ కంపెనీలకి, ధనవంతులకు తప్ప పేదవాడికి ఏమి ఉపయోగం లేదని చెప్పారు. దశాబ్దాల కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ యజమానులకే సర్వాధికారాలు ఇస్తుందని విమర్శించారు. ఒకవైపున విపరీతంగా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగరాజు తదితరులు

ఇవ్వాలని పోరాడుతుంటే పట్టించుకోని నరేంద్ర మోడీ కఠిన చట్టాలు తేవడం బాధాకరమన్నారు.

పాడేరు:అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సిఐటియు కార్యాలయంలో చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్ సిఐటియు జిల్లా కోశాధికారి శెట్టి నాగరాజు ఆధ్వర్యంలో రేకులు కాలనీ చిన్నారులతో శనివారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ప్రజల జీవనానికి తీవ్రమైన ప్రభావం చూపుతుందన్నారు. ఈ నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసన తెలపాలని పిలుపు నిచ్చారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న పడాల్

జూ పార్కుకు ఆర్ఒ ప్లాంట్ వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : స్వచ్ఛతా హై సేవా కార్యక్రమంలో భాగంగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటిలిజెన్స్ విశాఖపట్నం యూనిట్ ఆర్థిక సాయంతో ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు అత్యాధునిక ఆర్ఒ ప్లాంట్‌ను వితరణగా అందజేశారు. శనివారం జూ పార్కులో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్‌ను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటిలిజెన్స్ జాయింట్ డైరెక్టర్ వై.భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూ పార్కుకు వచ్చే సందర్శకుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వేసవి నేపథ్యంలో స్వచ్ఛమైన నీటిని అందించేందుకు అత్యాధునిక సాంకేతికతో కూడిన ఆర్ఒ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ ఆర్ఒ ప్లాంట్ గంటకు 500 లీటర్లు శుద్ధి చేస్తుందని వివరించారు. ఆర్ఒ ప్లాంట్ వితరణగా అందించిన ఇంటిలిజెన్స్ వైజాగ్ యూనిట్‌కు జూ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్లు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘం ఎఆర్ఇ నియామకం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల సంఘం ఆలుమ్ని రిలేషన్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఎస్.శ్రీనివాస్ నియమితులయ్యారు. శనివారం ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ నుంచి ఉత్తర్వులను శ్రీనివాస్ స్వీకరించారు. అనంతరం బాధ్యతను చేపట్టారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ, త్వరలో ఏయూ శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనుందని, దీనికనుగుణంగా బలమైన పూర్వవిద్యార్థుల సంఘాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. దేశ విదేశాలలో స్థిరపడిన పూర్వవిద్యార్థులను ఏకతాటిపైకి తీసుకొచ్చేవిధంగా పనిచేయాలన్నారు. ఏయూతో సమన్వయం చేస్తూ పూర్వవిద్యార్థుల సంఘాన్ని మరింత పటిష్టం చేయడానికి ప్రణాళిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఇఒ డాక్టర్ రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

బిఇడి విద్యార్థులకు కాగ్నిజెంట్ స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం బిఇడి స్పెషల్ ఎడ్యుకేషన్ చదువుతున్న విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ ప్రత్యేక స్కాలర్‌షిప్‌లను మంజూరు చేసింది. విద్యాద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రస్తుత బ్యాచ్‌లో 10 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను మంజూరుచేస్తూ అధికారిక ఉత్తర్వులను అందించింది. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.35 వేలు చొప్పున రెండు సంవత్సరాలు అందిస్తుంది. స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి శనివారం అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆర్ట్సుకామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, విద్యావిభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, విభాగ ఆచార్యులు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ బిల్లులను సర్పంచులు చెల్లించొద్దు'

ప్రజాశక్తి-సీతమ్మధార : సర్పంచులు విద్యుత్ బిల్లులు చెల్లించవద్దని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైబి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఏపీ సర్పంచుల సంఘం, ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర సర్పంచుల ముఖ్య నాయకులతో శనివారం పౌరగ్రంథలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. పంచాయతీ నిధులు కాజేయడమంటే గ్రామీణ ప్రజలను దోచుకోవడమేనని పేర్కొనానరు. వివిధ పథకాల ద్వారా పంచాయతీలకు వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం అందకుండా చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.6,660 కోట్లును రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. సర్పంచులకు గౌరవ వేతనం రూ.15వేలు, ఎంపిటిసి, జడ్‌పిటిసిలకు రూ.30 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలు నిధులు సర్పంచుల ద్వారా ఖర్చు చేయాలని కోరారు. గ్రామాల్లో కనీసం నీటి సదుపాయం లేదని, డ్రెయినేజీలు, బోర్లు రోడ్లు దుస్థితి చాలా దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు.

రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మి మాట్లాడుతూ, వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను సర్పంచుల ద్వారా ఖర్చు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రతినిధి పి.నరేంద్ర, వివిధ జిల్లాల గ్రామ సర్పంచులు, పంచాయతీరాజ్ నాయకులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై వేటు పట్ల నిరసన

ప్రజాశక్తి-పెందుర్తి : రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని వ్యతిరేకిస్తూ జివిఎంసి 96వ వార్డు పరిధి పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు శనివారం నిరసన తెలిపారు.

పరీక్షా సామగ్రి అందుకున్న విద్యార్థులు

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ఎటపాక : పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా రాయాలని ఎటపాక సీఐ గజేంద్ర కుమార్ సూచించారు. ఈ నెల 3 నుండి పది పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండలంలోని గుండాల, కేవన్ పురం, గౌరిదేవి పేట, కెజిబివి పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష రాసేందుకు ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి పది పరీక్షలలో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సై పార్ధ సారధి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలానికి చెందిన పొదుపు సంఘాల మహిళలకు మూడవ విడత ఆసరా చెక్కులను శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 784 గ్రూపులకు చెందిన 7500 మంది సభ్యులకు మూడు విడతలలో రూ.2.61 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ ఒడుగుల జ్యోతి, వైసిపి మండల కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీడీవో బాపన్నదొర, ఏపీఎం ఆదినారాయణ, మండల మహిళా అధ్యక్షురాలు కె వరలక్ష్మి, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కెజిహెచ్ రోగులకు డైట్ ఛార్జీల పెంపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్‌లో డైట్ ఛార్జీలను పెంచారు. శనివారం నుంచి అవి అమలులోకి వచ్చాయి. ఇన్ పేషెంట్లుగా ఉండే రోగులతో పాటు, గర్భిణులకు కూడా ప్రత్యేక మెనూ సిద్ధం చేశారు. ప్రస్తుతం కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం కోసం ఒక్కొక్కరికీ రూ.36 చెల్లిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇవే డైట్ ఛార్జీలు అమలవుతున్నాయి. రోగులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఛార్జీలను రూ.80కి పెంచింది. డ్యూటీ డాక్టర్ల కోసం రూ.80 చెల్లిస్తుండగా ఇకపై రూ.100 చెల్లిస్తారు. గర్భిణులకు ఒక్కొక్కరికీ రూ.100తో భోజనం అందించనున్నారు.

విఎంఆర్‌డిఎ సెక్రటరీగా రంగయ్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ సెక్రటరీగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సిహెచ్.రంగయ్య శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్, మెట్రో పాలిటన్ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు. రంగయ్య గతంలో ఎపిఐఐసి జోనల్ మేనేజర్గా బాధ్యతలు నిర్వహించిన విషయం తెలిసిందే.

కార్పొరేట్‌కు ధీటుగా గురుకులాలు

మంత్రి మేరుగు నాగార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, దేవరాపల్లి : రాష్ట్రంలోని ఎస్‌సి గురుకులాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా, శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ అభివృద్ధి చెందేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. ఈ క్రమంలోనే మధురవాడ గురుకులానికి చెందిన విద్యార్థులు తమ వినూత్న ఆవిష్కరణతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారని ఉదహరించారు. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా తమ విద్యార్థులు ఐఐటి, ఎన్ఐటి, ఎంబిబిస్ సీట్లు కూడా సాధిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో రెండు రోజుల పర్యటనకు వచ్చిన ఆయన్ని శనివారం సర్క్యూట్ హౌస్‌లో మధురవాడలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గురుకులం విద్యార్థులు, టీచర్లు కలిశారు. తాము సాధించిన ఘనతను వివరించారు. డాక్టర్ రోబోట్ ఆవిష్కరణ ద్వారా సిఇఇకి చెందిన ఆరుగురు విద్యార్థులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించిందని తెలిపారు. అనంతరం మంత్రి నాగార్జున విద్యార్థులు తయారు చేసిన డాక్టర్ రోబోట్‌ను పరిశీలించారు. దానిని తయారు చేసిన విద్యార్థులను అభినందించడంతో పాటు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు సంబంధించిన ధ్రువపత్రాలు అందించారు.

అనంతరం మంత్రి దేవరాపల్లిలోని ఎస్‌సి గురుకులాన్ని సందర్శించి అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. గురుకులంలోని అన్ని విభాగాలనూ పరిశీలించిన అనంతరం విద్యార్థులకు టెన్త్ హాల్ టిక్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతిలో రాష్ట్ర సగటు ఫలితాల కంటే ఎక్కువ ఫలితాలను తమ గురుకులం విద్యార్థులు

ధ్రువపత్రం అందజేస్తున్న మంత్రి నాగార్జున

సాధిస్తున్నారని తెలిపారు. ఏ కారణంతోనైనా పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేకంగా ట్యూషన్లు పెట్టించి మళ్లీ పరీక్షలకు పంపిస్తున్న విధానం కూడా మంచి ఫలితాలను ఇస్తోందన్నారు. పదో తరగతి తర్వాత ఉన్నత విద్యావకాశాలు మెరుగ్గా ఉండాలన్న లక్ష్యంతో ఐఐటి, నీట్ కోచింగ్ సెంటర్లను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఐఐటి, నీట్‌లలో మరిన్ని సీట్లు సాధించే లక్ష్యంతో ఈ ఏడాది నుంచి తమ విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ ఇప్పించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. పై చదువులు నిమిత్తం విదేశాలకు వెళ్లడానికి కూడా అవకాశం కల్పిస్తున్నామని అన్నారు.

అధికార పార్టీలో ఆందోళన..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ప్రమాదాన్ని ముందుగా ఊహిస్తే సగం అధిగమించినట్టే' - అంటారు థామస్ పుల్లర్ అనే యునైటెడ్ స్టేట్స్‌కు చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్టు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపికి సంబంధించి చూస్తే ఎమ్మెల్సీ ఎన్నికలను తమ ప్రభుత్వానికి సెమీఫైనల్స్ అంటూ మంత్రులు, పార్టీ పెద్దలు ఊదరగొట్టారు. ప్రజల్లో, ముఖ్యంగా మధ్యతరగతి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ పట్టభద్రుల్లో ప్రభుత్వ వ్యతిరేకతను ఊహించలేకపోయి ఉంటారా ? లేదా జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు 'ట్రయల్'గా భావించి సర్దుకుంటుంరా ? మండలి ఎన్నికలు సెమీఫైనల్స్ అన్నప్పుడు ఇక్కడ ఓటమి చెందాక ఫైనల్స్‌పై ఈ ప్రభావం (సాధారణ ఓటరు)పై పడకుండా ఉంటుందా ? పడకుండా ఉండేలాగ తమ పార్టీ మనుగడకు జరుగబోయే నష్టంపై ఒక అంచనాకు వచ్చి మేల్కొంటుంరా ? అన్నవి ఇప్పుడు తాజా ప్రశ్నలు. ఇదంతా ఒక ఎత్తు కాగా... తాజా రాజకీయ పరిణామాలతో విశాఖపట్నం జిల్లాకు చెందిన వారే కాకుండా యావత్ ఉత్తరాంధ్ర అధికార పార్టీ మంత్రులు, ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధుల్లో రాజకీయ నిరాశ నెలకొంది. ప్రభుత్వ వ్యతిరేకత తమను వచ్చే ఎన్నికల్లో దెబ్బ కొడుతుందన్న ఆవేదనను వ్యక్తం చేయడం పరిపాటిగా మారింది.

ఊరటనిచ్చే విషయాలున్నా ఆందోళన ఎందుకు ?

ప్రజా సంక్షేమం పేరుతో పథకాలను అమలు చేస్తూ పేద, సామాన్య కుటుంబాలకు రాష్ట్రంలో రూ.వందల కోట్లు నేరుగా బటన్ నొక్కి ప్రజల ఖాతాల్లో డబ్బులు వేయడం కోవిడ్-19 తర్వాత నుంచీ కొనసాగుతూనే ఉంది. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం అమలు చేసిన రాష్ట్రం దేశంలోనే ఏదీ లేదంటూ వైసిపి నేతలు ఓ పక్క ప్రచారం చేసుకుంటున్నారు. కానీ రాజకీయ అసంతృప్తులు పెరిగిపోతున్నాయి. ఉన్న వారు జారిపోతున్నారు. సాధారణంగా ఎలాంటి ప్రభుత్వంపైనైనా మూడేళ్లు దాటాక అసంతృప్తి ప్రజల్లో సహజంగా పెరగడం ఉంటుందన్నది రాజకీయ విశ్లేషకుల మాట. అయితే ఏ ఎన్నికలు నిర్వహించినా అధికార పార్టీకి దెబ్బ తగలడం ఇక్కడ గుర్తుంచుకోదగినది. సర్పంచ్‌లుగా సొంత పార్టీ నుంచి గెలుపొందిన ప్రజాప్రతినిధులకు వివిధ అభివృద్ధి పనులకు నిధుల్లేక అల్లాడిపోతున్నారు. విశాఖపట్నం జిల్లా పంచాయతీ కార్యాలయం ద్వారా గ్రామ పంచాయతీలకు ఏటా గతంలో రూ.240 కోట్ల వరకూ వివిధ అభివృద్ధి పనులకు నిధులు వెచ్చించేవారు. 2020 తర్వాత ఈ ప్రభుత్వ హయాంలో దీంట్లో సగానికి నిధులు పడిపోయాయి. ఉపాధి హామీ పథకాలే అమలు అవుతున్నాయి. దీంతో అధికార పార్టీ సర్పంచ్‌లు.. గతంలో గ్రామస్థాయిలో డబ్బులు ఖర్చుపెట్టి గెలిచిన వారు నిరాశకు లోనవుతున్నారు. చాలా చోట్ల అధికార వైసిపికి వ్యతిరేక ప్రచారం వీరే చేస్తున్నారంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఈ ప్రమాదాన్ని వైసిపి అధిష్టానం పసిగట్టిందా ? లేదా ? అన్నది చూడాల్సిందే..

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో విశాఖ రాజధాని వాదన ఇలా..

అధికార పార్టీ మంత్రులు, పార్టీ పెద్దలు ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల ఫలితాలనంతరం విశాఖ రాజధాని అంటూ ఊదరగొట్టడం మానుకున్నారు. జులైలో సుప్రీం కోర్టులో విషయం తేలాక.. ఆ వాతావరణం అధికార వైసిపికి అనుకూలమా? వ్యతిరేకమా? అన్న దానిబట్టి విశాఖ రాజధాని అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందుకు తెస్తారా ? వీటేమిటితోనూ నిమిత్తం లేకుండా విశాఖలో వచ్చి జగన్ కూర్చొని పాలన చేస్తారా ? అన్న చర్చ జరుగుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు నార్త్ ఆంధ్రా ఎమ్మెల్సీ ఎన్నికలు రిఫరెండం కానుందని చెప్పినవారందరికీ నేడు నోట్లో పచ్చివెలక్కాయ పడినట్టయింది. ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ అధ్యక్షులు సీతంరాజు సుధాకర్ వైసిపికి నమ్మిన బంటు. ఆయన గెలుపు సునాయాశం అంటూ వైసిపి నేతలు ఊకదంపుడు కొట్టి బోర్లాపడ్డారు. ప్రభుత్వ వ్యతిరేకత ఆయన్ని దెబ్బతీసింది. 15 ఏళ్లుగా పార్టీనే నమ్ముకున్న స్థానిక మత్స్యకార నాయకుడు కోలా గురువులునూ ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకతే దెబ్బకొట్టింది.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విఆర్.పురం : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను మండల కేంద్రం రేఖపల్లిలోని సిపిఎం కార్యాలయంలో సిఐటియు నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సున్నం రంగమ్మ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు, స్కీమ్ వర్కర్లు చలో ఢిల్లీకి అధిక సంఖ్యలో తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు. చాలీచాలని వేతనాలతో అధిక పనిభారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్కీమ్ వర్కర్ల పట్ల ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు ఉయిక, అంగన్వాడీ యూనియన్ నాయకులు సోడే కనకలక్ష్మి, సుజాత, డైలీవేజ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాయం లక్ష్మి పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త

- ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి-రంపచోడవరం : భార్యను భర్త హత్య చేసిన సంఘటన రంపచోడవరంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్ఐ మోహన్‌కుమార్ కథనం ప్రకారం... రంపచోడవరం మండలం, సాయినగరంలో పిల్ల శివకృష్ణ, నాగమణి (32) దంపతులు నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శివకృష్ణ ఎపి ట్రాన్స్‌కోలో కాంట్రాక్ట్ పనులు చేస్తున్నాడు. భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. మూడు రోజులుగా నాగమణి కనిపించకపోవడంతో ఆమె తల్లి గుబ్బలమ్మ మార్చి 30న రంపచోడవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు భర్త శివకృష్ణపై అనుమానంతో ఆయన్ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. కుటుంబ కలహాల వల్ల తానే ఇంటి వద్ద చున్నీతో నాగమణి పీకకు ఉరివేసి చంపేసినట్లు, ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని గొనె సంచిలో కట్టి గంగవరం మండలం సురంపాలెం జలాశయంలో పడేసినట్టు శివకృష్ణ తెలిపారు. దీంతో పోలీసులు జలాశయంలో గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. శివకృష్ణపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలమాంబ జాతరకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 4న మంగళవారం జరగనున్న పెదవాల్తేరు శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని విశాఖ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష పేర్కొన్నారు. శనివారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పిండింట్ల శంకరరెడ్డి, 17వ వార్డు వైసిపి సీనియర్ నాయకులు గేదెల నాగరాజు, 20వ వార్డు నాయకులు ముచ్చల సురేష్ పాల్గొన్నారు.

యువతను మోసగించిన జగన్ ప్రభుత్వం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : యువత సన్మార్గంలో నడవాలంటే ఉపాధి అవకాశాలు ఉండాలని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాక ముందు పాదయాత్రలో జాబ్ క్యాలెండర్లు, ఉద్యోగ అవకాశాలు అంటూ బోలెడు ప్రకటనలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా ఆ హామీలను నెరవేర్చకుండా మోసం చేశారని విమర్శించారు. సమావేశంలో తెలుగు యువత విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు వలిశెట్టి తాతాజీ పాల్గొన్నారు.